ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు

- పాతబస్తీలో ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు
- నంబర్ ప్లేట్ల మార్పులు, చేర్పులు చేస్తున్న వాహనదారులు
- చూసీచూడనట్లుగా దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు

చార్మినార్: పాతబస్తీలో ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరవుతున్నాయి. దక్షిణ మండలంలో చార్మినార్, మీర్‌చౌక్, ఫలక్‌నుమా, బహదూర్‌పురా తదితర నాలుగు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లుండగా.. దక్షిణ తూర్పు మండలంలో బండ్లగూడ, సంతోష్ నగర్, మలక్‌పేట్, సైదాబాద్‌లతో పాటు దక్షిణ పశ్చిమ మండలంలో మరో నాలుగు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లున్నాయి. వీటి పరిధిలో రెండు, మూడు జాతీయ రహదారులతో పాటు ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లున్నాయి. ఈ రోడ్లలో ప్రతి రోజూ వాహనాల రాకపోకలు జోరుగా కొనసాగుతాయి. అయితే కొంత మంది వాహనదారులు నిబంధనలు డోంట్ కేర్ అంటూ వాహనాలను అడ్డదిడ్డంగా నడుపుతూ ఇతర వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. విధి నిర్వహణలో పోలీసులున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు.

ఆశించిన మేరకు అందుబాటులో లేని సిగ్నల్స్..

ప్రధాన కూడళ్లలో ఆశించిన మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొంత మంది వాహనదారులు కావాలని తమ వాహనాలను నడుపుతూ ఇతరులకు ట్రాఫిక్ సమస్యలను కలిగిస్తున్నారు. అవసరమైన మేరకు ట్రాఫిక్ పోలీసులు సైతం విధి నిర్వహణలో ఉండకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వీరిని కట్టడి చేసే వారు లేకపోవడంతో మితిమీరి ప్రవస్తున్నారు. కొద్ది మంది మాత్రమే హెల్మెట్లు వినియోగిస్తుండగా..కొంత మంది ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నారు.


ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్

ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్న వాహనదారులు..

ద్విచక్ర వాహనదారుల్లో కొంత మంది యువకులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు.అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్ని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ..కొంత మంది ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంటుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ల మార్పులు..

పాతబస్తీలోని కొంత మంది వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకోవడం కోసం వాహనాల నంబర్ ప్లేట్లను మార్చేస్తున్నారు. ఆర్టీఏ ద్వారా మంజూరైన సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను కొంత మంది వాహనదారులు ఉద్దేశపూర్వకంగా మార్పులు, చేర్పులు చేస్తూ ఆర్టీఏ, ట్రాఫిక్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొంత మంది నంబర్ ప్లేట్లను కనిపించకుండా చేస్తుండటంతో మరికొంత మంది సగం వరకు నంబర్ ప్లేట్లను వంచేయడం.. ఇంకొంత మంది విరగ్గొట్టడం..ప్లాస్టర్లు అతికించడం..తదితర ఉద్దేశపూర్వక పనులకు పాల్పడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంగనాథ స్వామికి చక్రస్నానం

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి ఆలయ రంగ పుష్కరిణిలో అవబృత స్నానం, ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అభిషేకం నిర్వహించి భక్తులపై చల్లి సంప్రోక్షణ చేసి ప్రసాదం నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. చివరగా వాహన సేవా, ఏకాంత సేవా కార్యక్రమం పూర్తి చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాస రంగనాథ బట్టాచార్యుల నేతృత్వంలో జరిగాయి. చివరగా ఆలయ ట్రస్టీ ఎస్.టీ. చారి, ఆలయ ప్రతినిధి శేషాచారి, బద్రినాథ్‌చారి మాట్లాడుతూ..ఈ నెల 25న లక్ష వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం, 28న సహస్ర (1008) కలశాలతో మహా అభిషేకం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.


దేవేరులకు చక్రస్నానం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ బట్టా చార్యులు

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ


జై సంవిధాన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్

చాంద్రాయణగుట్ట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం జై సంవిధాన్ ఇన్‌చార్జి, మానుకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ అన్నారు. పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్ ఆధ్వర్యంలో జంగమ్మెట్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను సమానత్వం, సౌభ్రాతృత్వంతో మెలగాలని చైతన్య పరిచారన్నారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ ముదిరాజ్, పర్వతాల రాజేందర్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్, ప్రమోద్ రెడ్డి, మధుమోహన్, లక్ష్మణ్ చారి, అనిల్ కుమార్, రాజు ముదిరాజ్, అబ్దుల్ ఖాదర్, హబీబ్, అమీర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: టోలిచౌకీ డిలక్స్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారు నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. షేక్‌పేట్ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు జునైది తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ మెగా వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. వివిధ ఆసుపత్రులకు చెందిన డెంటల్, ఆర్థోపెడిక్, కార్డియాక్, మధుమేహం, కంటి వైద్యులతో పాటు అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9603273210, 9391046826లలో సంప్రదించవచ్చు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు


హజ్ యాత్రకు వెళ్తున్న వారికి వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దైవకృప ఉన్న వారికి హజ్ యాత్రకు వెళ్లే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. హజ్ యాత్రకు వెళ్తున్న వారిని శనివారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హజ్ యాత్రకు వెళ్లే వారు ముందుగా దేశం కోసం ప్రార్థనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, రహమత్, తయ్యబ్, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ తదితరులున్నారు.

కోటలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న చంటిబాబు

గోల్కొండ: గోల్కొండలోని జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి. బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబుతో పాటు కమిటీ ప్రతినిధులు ఎస్.అశోక్, డి.అనిత తదితరులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించారు.

వ్యభిచార గృహంపై దాడి

గోల్కొండ: వ్యభిచార గృహంపై టోలిచౌకీ పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకీ ప్యారామౌంట్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం సాగుతుందని పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం అర్ధరాత్రి ప్యారామౌంట్ కాలనీలో వ్యభిచారం సాగుతున్న ఇంటిపై పోలీసులు దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా ప్యారామౌంట్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి ఒంటి గంట తరువాత కూడా హోటల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మేరు కులస్తులకు చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలి


మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఎంతో వెనుకబడిన మేరు కులస్తులకు చేయూతనివ్వాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా మేరు కులస్తులు అభివృద్ధి చెందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గత పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో మేరుకులస్తుల పాత్ర ఎంతో ఉందన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి


డాక్టర్ జయ

చార్మినార్/దూద్‌బౌలి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలను అందిస్తుందని పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ టీ.జయ అన్నారు. శనివారం పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రజిని రెడ్డి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నీలోఫర్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న జయ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణలోనే అతి పెద్దదైన ఈ ఆసుపత్రిలో గర్భిణులు ప్రతిరోజు వందలాది మంది వస్తుంటారన్నారు. వారికి మెరుగైన చికిత్సలు అందించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జియాగూడ: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని కార్వాన్ శివశంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పదాల అనంత కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడ కార్వాన్‌లోని శివ శంకర క్రాంతి సేవా సమితి, కిమ్స్ ఆసుపత్రిల ఆధ్వర్యంలో భవనంలో ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పిడియాట్రిక్స్, గ్యాస్ట్రోలజీ, ఈసీజీ, పీఎఫ్‌టీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ లింగ్, శ్రీకాంత్, మణికంఠ, వినీత్, గోపీ, పవన్, సురేందర్ పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో శివశంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పదాల అనంత కృష్ణ తదితరులు

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఉండాలి


ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌ను సన్మానిస్తున్న డీటీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

విజయనగర్‌కాలనీ: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఉండాలని ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నడికుడ ఆనంద్ అన్నారు. ఇటీవల ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..బస్తీలు, కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటిముందు చబుత్రాలపై అర్ధరాత్రి వరకు ఎవ్వరు కూర్చోరాదని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులుకు సమాచారం అందించాలన్నారు. రాబోయే బక్రీద్, బోనాల పండుగను ప్రజలందరూ కలిసిమెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు జె.మహేష్, శ్రీనివాస్, విజయ్, నర్సింగ్, శివనారాయణ, శీలం బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. పటేల్‌నగర్‌లో శనివారం ఆమె రూ.3.90 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లో ని ప్రజలు శిథిలావస్థకు చేరుకున్న రోడ్డుతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో జీహెచ్ఎంసీ ద్వారా రూ.3.90 లక్షల నిధులను మంజూరు చేయించి నూతన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నా రు. డివిజన్‌లోని ప్రజలు ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు జి.రఘుకా ంత్, కె.రాజ్ కుమార్, బి.రమేశ్ యాదవ్, కె. యాదయ్య, కె.సాయి కుమార్, జి.వికాస్, డాక్టర్ విజయ్, రాజుచారి, బస్తీవాసులు కె.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, ఆర్.సునిల్, డి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

నేడు పాతబస్తీలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ యాత్ర

చార్మినార్: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ యాత్ర ఈ నెల 25న ఆదివారం, సాయంత్రం 5 గంటలకు గాంధీ బొమ్మ నుంచి ఛత్రినాక చౌరస్తా వరకు నిర్వహించనున్నట్లు జాతీయ చైతన్య మహిళా వేదిక చార్మినార్ బాగ్ ప్రతినిధులు తెలిపారు. పహల్గాం జిహాదీ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి ప్రతీకారం తీర్చుకున్న యావత్ భారత దేశానికి గర్వ కారణంగా నిలిచిన మన సైనికులకు అండగా నిలిచి మద్దతు తెలపడం కోసం ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీ అనంతరం సభ జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీగా సుఖ్‌దేవ్ సింగ్



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీగా సుఖ్‌దేవ్ సింగ్ శనివారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పని చేసిన మహ్మద్ గౌస్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేసి ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పని చేస్తున్న సుఖ్‌దేవ్ సింగ్‌ను సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ బేగంబజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని బేగంబజార్ ఛత్రి కోల్సావాడి, గాం, దీగల్లీ, సాబూ, పోస్ట్ ఆఫీస్, చేపల మార్కెట్, లేబర్ అడ్డా, దీపక్ నర్సింగ్ హోమ్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఎంజే మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని శ్రావణ్ ఆసుపత్రి సీనా హోటల్, మాలకుంట పెట్రోల్ పంప్, రిజిస్టర్ కార్యాలయం, పెన్ పీటీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

భీమ్‌సేన్ జైస్వాల్‌కు ఘన నివాళి

సుల్తాన్‌బజార్: ప్రముఖ సంఘ సేవకుడు భీమ్‌సేన్ జైస్వాల్ నాల్గవ వర్ధంతి సందర్భంగా శనివారం గౌలిగూడలో బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో భీమ్‌సేన్ నాల్గవ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ హాజరై పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భీమ్‌సేన్ లాంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారని, వారి సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, ఆకాష్, సురేష్, నితిన్, నర్సింగ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి



అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమ జరుగుతుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం గోషామహల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్మల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌సింగ్, కిషన్, బద్రినాథ్, గోకరణ్ సింగ్, శంకర్ సింగ్, బబ్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అబిడ్స్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఠాకూర్ గోపాల్ సింగ్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రహింపురా అంబేడ్కర్ భవన్‌లో రెండో రోజు ఉచిత మెగా వైద్య శిబిరం కొనసాగించారు. ఈ సందర్భంగా ఠాకూర్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ..సత్య సుందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోనే కాక జిల్లాల్లో సైతం తరచూ ఉచిత మెగా వైద్య శిబిరాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. సమాజంలో పేద బడుగు వర్గాల సంక్షేమం కోసమే తమ ఫౌండేషన్ నిర్విరామంగా సేవలందిస్తుందని గోపాల్‌సింగ్ వివరించారు. స్థానికంగా ధూల్‌పేట్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన వారికి రెండు రోజుల పాటు ఉచిత వైద్య సేవలు అందించామని ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఠాకూర్ గోపాల్ సింగ్ వివరించారు. మహిళలు, చిన్నపిల్లలకు, గుండె, కంటి, ఊపిరితిత్తులు, రక్త పరీక్షలు, ఇతర పలు విభాగాల పరీక్షలు నిర్వహించామన్నారు. బద్రినాథ్ సింగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

‘ఈ సారి బోనాలను వైభవంగా నిర్వహిస్తాం’


చంటిబాబు

లంగర్‌హౌస్: గోల్కొండ బోనాలను ఈసారి మరింత వైభవంగా నిర్వహించనున్నామని గోల్కొండ జగదాంబిక బోనాల కమిటీ చైర్మన్ కె. చంటిబాబు అన్నారు. గోల్కొండ జగదాంబిక బోనాల కమిటీ చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆయన తనకు ఇంతటి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి, మంత్రులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..జూన్ 26న మొదటి పూజతో తెలంగాణ బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రభుత్వ అన్ని శాఖల వారితో సమావేశాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు

గోల్కొండ: వేర్వేరు ప్రాంతాల్లో బైక్ చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న యువకులను అరెస్టు చేశారు. శనివారం టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న పాతనగరానికి చెందిన ఫ్లవర్ డెకొరేటర్ సయ్యద్ ఖాజా లంగర్‌హౌస్‌లోని రామాలయం గ్రౌండ్‌లో తన బైక్‌ను పెట్టి ఉదయం వచ్చి చూడగా బైక్ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లంగర్‌హౌస్ పోలీసులు 23న బాపూఘాట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. బైక్ పై వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో లేబర్‌గా పని చేసే వర్కియా గోపాల్‌గా తెలిసింది. దురలవాట్లకు బానిసై బైక్ దొంగతనాలు చేస్తున్నట్లు అంగీకరించారు. రద్దీ ప్రాంతాల్లో మారు తాళం చెవితో బైక్‌లు దొంగలించి వాటిని అమ్ముతున్నట్లు పోలీసులకు తెలిపాడు. అతడి నుంచి దొంగలించిన ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జి.చంద్రమోహన్

- మెహిదీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ మహిళను పోలీసులు పట్టుకున్నారు. అఫ్జల్‌సాగర్ మాంగార్ బస్తీకి చెందిన హతగల్లే సంజన చైన్‌స్నాచింగ్‌లకు అలవాటు పడింది. ఈ నెల 20న వికారాబాద్‌కు చెందిన జి.హైమా తన భర్తతో కలిసి మెహిదీపట్నం బస్టాండ్‌లో వికారాబాద్‌కు వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తుంది. బస్సులో కూర్చున్న తర్వాత తన బ్యాగ్ తీసుకోగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసింది. 23న విజయనగర్ కాలనీలోని బంగారం షాపులో దొంగలించిన బంగారం అమ్ముతున్న సంజనను పోలీసులు అదుపులోకి తీసుకుని నుంచి 45 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- షేక్‌పేట్ ఓయూ కాలనీకి చెందిన శ్యామ్‌కుమార్ ఈ నెల 14న టోలిచౌకీ మెయిన్ రోడ్ పై ఎలక్ట్రానిక్స్ వద్ద ఫోన్‌లో తనకు వచ్చిన స్విగ్గి ఆర్డర్‌లను చూసుకుంటున్నాడు. అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చిన ముగ్గురు యువకులు అతడి చేతిలోని ఫోన్‌ను లాక్కొని పరారైయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బి.విల్సన్, గండూరి జఫన్యరాజ్, గంట పవన్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు చైతన్యపురిలోని అక్షయ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్నారు.
- టోలిచౌకీ నిరజా కాలనీకి చెందిన మహ్మద్‌ఆలం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కిరాణా దుకానికి వచ్చి వెళ్తుండగా ఇద్దరు యువకులు వచ్చి అతడి చేతిలోకి సెల్‌ఫోన్ లాక్కుని పరారైయ్యారు. ఈ నెల 23న టోలిచౌకీ బృందావన్ కాలనీ రాఘవేంద్రహోటల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు పోలీసులకను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా తాము సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసినట్లు ఎస్.శివ, బి.భరత్ పోలీసులకు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, విజయ్‌శ్రీనివాస్, టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కాశమోని శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: ఇందిరానగర్ శ్మశాన వాటికలో సదుపాయాల కల్పనకు రూ.40 లక్షలు మంజూరు కావడంపై గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులకు మజ్లిస్ పార్టీ వార్డు సభ్యుడు సయ్యద్ షరీఫ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో వెయిటింగ్ హాల్ లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరీకి సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ షఫీ, భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పెరోజీ సాయినాథ్, సభ్యులు వీరేందర్, ప్రదీప్ కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

సుల్తాన్‌బజార్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మహిళా చైతన్య వేదిక, దుర్గావాహిని వీహెచ్‌పీ మహిళా వింగ్ సంయుక్తాధ్వర్యంలో కోఠి వీహెచ్‌పీ కార్యాలయం నుంచి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొని జాతీయ జెండాను చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గవాహిని కన్వీనర్ వాణి సక్కుబాయి మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచ దేశాలకు ఇండియా బలం తెలిసివచ్చిందన్నారు. మన దేశంలోనే కొందరు శత్రుదేశాల మద్దతుదారులు ఉన్నారని వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

